క్లుప్తంగా

7న ఉపాధి హామీ సోషల్ ఆడిట్

పొదలకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సోషల్ ఆడిట్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వామా పీడీ వెంకట్రావ్ హాజరుకానున్నారని చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొడవలూరు: మండలంలోని పైడేరు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం కనుగొన్నారు. అల్లూరు రోడ్డులోని కొండాయపాళెం వద్ద పైడేరు కాలువలో వ్యక్తి మృతదేహం ఉందనే అంశాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బుచ్చిరెడ్డిపాళెం సీఐ రామారావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. మృతదేహం కుళ్లిపోయి.. గుర్తుపట్టలేని విధంగా మారింది. మృతుడికి 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. నల్లరంగు నిక్కరు, గోధుమ రంగు చొక్కాను ధరించి ఉన్నారు. పైడేరులో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందారా లేక ఇతర కారణాలున్నాయాననే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ ఘటనపై పోలీసుల విచారణ

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో మంగళవారం పట్టపగలు జరిగిన చోరీ ఘటనపై విచారణను పోలీసులు బుధవారం చేపట్టారు. పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకెళ్లిన వాసు కుటుంబ సభ్యులు మధ్యాహ్నం చేరుకునేసరికి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి 33 సవర్ల బంగారు నగలు, రూ.35 వేలను చోరీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. వాసు కుటుంబ సభ్యుల కదలికలు తెలిసిన వ్యక్తులే పక్కా ప్రణాళికతో చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వాసు ఇంటి పక్కన వారితో పాటు గ్రామంలో కొందర్ని పోలీసులు విచారించారు.

వైఎస్సార్‌సీపీలో చేరినందుకు టీడీపీ నేతల దాడి

తోటపల్లిగూడూరు: టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు తనపై ప్రత్యర్థులు కక్షగట్టి దాడి చేశారని తోటపల్లిగూడూరు మండలంలోని చింతోపునకు చెందిన తమ్మిరెడ్డి మమత ఆరోపించారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తన గోడును వెళ్లబోసుకున్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తాను చేరానని, పొలంలో గత నెల 29న పనిచేసుకుంటుండగా, తనపై ముగ్గురు ఇనుప రాడ్లతో దాడి చేసి, తీవ్రంగా గాయపర్చారని చెప్పారు. నిందితులైన మనుబోలు చంద్రశేఖర్, పోలయ్య, పచ్చా వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత



కోవూరు: జంతువుల సంరక్షణ అందరి బాధ్యత కావాలని కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన కోరారు. అంతర్జాతీయ జంతు సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్‌ప్రసాద్, అధ్యాపకులు లావణ్య తదితరులు పాల్గొన్నారు

వివాహితపై పెట్రోల్‌తో దాడి

మనుబోలు: పాతకక్షలను మనస్సులో పెట్టుకొని వివాహితపై పెట్రోల్ పోసి వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన మండలంలోని వీరంపల్లి సమీపంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బంధువుల వివరాల మేరకు.. వెంకటాచలం మండలంలోని జంగాలపల్లికి చెందిన సునంద, ఇడిమేపల్లికి చెందిన మనోజ స్నేహితులు. వెండి పట్టీల కొనుగోలుకు ఇద్దరూ కలిసి పొదలకూరుకు స్కూటీపై మంగళవారం బయల్దేరారు. వీరంపల్లి సమీపంలో సునంద స్కూటీ దిగగా, దివ్యాంగురాలైన మనోజ వాహనం వద్దే ఉండిపోయారు. ఈ క్రమంలో వీరిని వెంబడిస్తున్న జంగాలపల్లికి చెందిన బెల్లంకొండ పుట్టయ్య ఒంటరిగా ఉన్న సునందపై పెట్రోల్‌తో దాడి చేశారు. ముఖంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. సునంద పెద్దగా కేకలేయడంతో పొలాల్లోని రైతులు రావడంతో పుట్టయ్య పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన సునందను చికిత్స నిమిత్తం నెల్లూరుకు.. అనంతరం చెన్నై తరలించారు. పాత కక్షల నేపథ్యంలో హత్యాయత్నం చేశారని, పుట్టయ్య నుంచి సునందకు ప్రాణహాని ఉందని, రక్షించాలని భర్త వెంకటేశ్వర్లు కోరారు. కాగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని.. అయితే హత్యాయత్నంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. చెన్నై వెళ్లి బాధితులతో మాట్లాడి విచారణ చేస్తామని చెప్పారు.

వైద్యం వికటించి.. కాలం కాటేసి

- ఆర్నెల్లుగా మంచానికే పరిమితం
- శస్త్రచికిత్సకు నగదు లేక అవస్థ
- మందుల కొనుగోలుకు పింఛనే ఆధారం
- ఆపరేషన్‌కు సాయం చేయాలని వేడుకోలు



అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఖాజారసూల్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. కుటుంబ పెద్దకు ఆరోగ్య సమస్య వచ్చి ఆపరేషన్ చేయించుకున్నా, అది వికటించడంతో మంచానికే పరిమితమయ్యారు. ఫలితంగా మరోసారి ఆపరేషన్ చేయించుకునేందుకు నగదు లేక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.మూడు వేల పింఛన్‌తో మందులను కొనుగోలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

నరాల సంబంధిత సమస్య

నవాబుపేటలోని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన ఖాజారసూల్ చెక్క బండి వేసుకుంటూ.. స్టోన్‌హౌస్‌పేటలోని లారీ ట్రాన్స్‌పోర్టులో హమాలీగా పనిచేసేవారు. దీని ద్వారా వచ్చే మొత్తంతో భార్య ఆరిఫా, పదేళ్ల కుమార్తె ముస్కాన్‌ను పోషించేవారు. ఈ క్రమంలో నరాల సంబంధిత సమస్య రావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించారు. ఖాజారసూల్ కడుపులోని పెద్ద పేగు దెబ్బతినిందని, వెంటనే ఆపరేషన్ చేసి సరిచేయాలని వైద్యులు సూచించారు. దీంతో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆపరేషన్ అనంతరం ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించింది. మల విసర్జన కాకపోవడంతో పాటు పొట్ట బాగా ఉబ్బిపోయింది. దీంతో ఆస్పత్రి వైద్యులను సంప్రదించగా, మలవిసర్జన కోసం నడుము వద్ద బ్యాగ్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఖాజారసూల్ మంచానికే పరిమితమయ్యారు. మరోసారి ఆపరేషన్ చేయాలని, లేని పక్షంలో ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు తెలిపారు. దీనికి రూ.రెండు లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. ఆపరేషన్‌కు సరిపడా డబ్బుల్లేక అగచాట్లు పడుతున్నారు. ఖాజారసూల్ భార్య ఆరిఫా ఇంట్లో చిన్న దుకాణాన్ని పెట్టుకొని కుట్టు ద్వారా కుటుంబ అవసరాలను తీరుస్తున్నారు. సాయం చేయాలనుకునే దాతలు 97039 71786 నంబర్‌ను సంప్రదించి వేడుకుంటున్నారు.

చిన్నారులకు వైద్య శిబిరం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించేందుకు గానూ వైద్య శిబిరంతో పాటు హెచ్ఎల్ఏ పరీక్షలను నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో జిల్లా చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దాదాపు 150 మంది చిన్నారులకు భోజనాలను జీఎంజీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న 100 మంది పిల్లలకు రక్తాన్ని అందించమే కాకుండా ఉచితంగా మందులు, భోజన వసతిని రెడ్‌క్రాస్‌లో ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దాదాపు రూ.25 లక్షల ఖర్చవుతుందని, దాతల సహకారంతో ఏడుగురు చిన్నారులకు చికిత్సను అందించి వారిని పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దామని తెలిపారు. తలసేమియా కన్వీనర్ డాక్టర్ సీత, అడ్వైజర్ డాక్టర్ హరిత, డాక్టర్లు రమ్య, యశోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నేతలు



నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ కావలి నియోజకవర్గ నేతలు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా అయన్ను సత్కరించారు.

నిరాశ్రయుల కోసం నూతన కేంద్రాలు



బీసీ వసతిగృహ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిరాశ్రయుల కోసం నిర్వహిస్తున్న కేంద్రానికి అదనంగా మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కొండాయపాళెం గేట్ సమీపంలోని బీసీ వసతి గృహం, ఏబీఎం ప్రాంగణాలను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాత మున్సిపల్ కార్యాలయంలో నిరాశ్రయుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో నూతన వసతి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. సంబంధిత నిర్వాహకులతో మాట్లాడి నగరంలోని నిరాశ్రయులకు ఆయా కేంద్రాల్లో వసతి కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.

⇨ ఎఫ్‌సీఐ, జేవీఆర్, వండ్లూరు కాలనీల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను కమిషనర్ సందర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ అమలు తీరును పర్యవేక్షించారు. ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు, పరీక్షలతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు.

⇨ 31 / 3 శివాజీనగర్, 37 / 1 పాత మిలటరీ కాలనీ సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. పన్ను వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్ఓ వెంకటరమణ, వైద్యాధికారి జీజియాబాయ్, టీపీఆర్వో ప్రసాద్, మెప్మా పీడీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్, నాగేంద్రకు ఘన నివాళి



నెల్లూరు(పొగతోట): లక్ష్మీపురంలోని ది నెల్లూరు రైస్ మిల్లర్స్, డీలర్స్ అసోసియేసన్ కార్యాలయంలో హరిత పితామహుడు ఎమ్మెస్ స్వామినాథన్‌కు బుధవారం నివాళులర్పించారు. తొలుత స్వామినాథన్, రైతు సమాఖ్య నేత ఎర్నేని నాగేంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగ సమస్యలపై అవగాహన సదస్సు



నెల్లూరు సిటీ: హృద్రోగ వ్యాధులపై జేసీఐ ఇండియా అసోసియేషన్ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నారాయణ హాస్పిటల్ గుండె వైద్యుడు తిలక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గుండెపోటుకు ముందస్తు లక్షణాలు, అపోహలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. తమ ఆస్పత్రిలో అధునాతన ఎఫ్‌డీ 20 క్లారిటీ క్యాథలాబ్ సాయంతో వైద్య చికిత్సలను అందిస్తున్నామని వివరించారు. సత్యనారాయణ, జేసీఐ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, నారాయణ హాస్పిటల్ ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



కొడవలూరు: టపాతోపులోని విశ్వజనని అనాథాశ్రమంలో బాలబాలికలకు అన్నదానాన్ని బుధవారం నిర్వహించారు. క్రైమ్ సర్వైలెన్స్, ఇంటెలిజెన్స్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ చుక్కా పవన్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన మిత్ర బృంద ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. స్వర్ణా నవీన్, కాగితాల సాయి సందీప్, కరేటి సాయిచంద్, రాఘవేంద్ర, రాఘవ, ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం



పొదలకూరు: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఇక్కడ బ్లడ్ బ్యాంక్‌ను ఇటీవల ఏర్పాటు చేసిన నేపథ్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 15 మంది రక్తదానం చేశారు. దాతలకు సర్టిఫికెట్లను డీడీఓ డాక్టర్ ప్రసాద్ అందజేశారు. డాక్టర్లు పద్మావతి, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ



ఇందుకూరుపేట: మండలంలోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు బూట్లను బుధవారం అందజేశారు. ఇందుకూరుపేటకు చెందిన దాసరి విజయ్‌కుమార్ తన సతీమణి సుహాసిని జ్ఞాపకార్థం వీటిని సమకూర్చారు. ఈ క్రమంలో పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జనార్దన్‌రావు పంపిణీ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి



మనుబోలు: ఇళ్ల స్థలాలను కేటాయించాలని విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని బుధవారం సమర్పించిన అనంతరం ఆలూరు రాము, జగదీష్‌బాబు మాట్లాడారు. చూపు మందగించి జీవనాధారమైన వృత్తిని కొనసాగించలేని విశ్వబ్రాహ్మణులకు పింఛన్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు రూరల్: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను సౌత్‌మోపూరులోని వాణిశ్రీ జెడ్పీ హైస్కూల్లో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్, ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్రరావు మాట్లాడారు. నగరంలోని ఏసీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు.

హాకీ అండర్ – 14లో ఐదుగురు, ఫుట్‌బాల్ అండర్ – 14లో ముగ్గురు, క్యారమ్స్ అండర్ – 14లో నలుగురు, అండర్ – 17లో నలుగురు ఎంపికయ్యారని వివరించారు. విశాఖపట్నం, ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో వీరు పాల్గొననున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానాన్ని కల్పిస్తామని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 33వ డివిజన్లోని పలు ప్రాంతాలకు చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. వీరికి కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. పార్టీని మరింత అభివృద్ధి చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..





నెల్లూరు(దర్గామిట్ట) / నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని వారి నివాసాల్లో జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో నాలుగో విడతలో భర్తీ కాని సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ బాలుర కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు iti.ap.gov.inలో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో అక్కడ సర్టిఫికెట్ల ధ్రువీకరణను ఈ నెల 8లోపు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి ఈ నెల 9న, ప్రైవేట్ ఐటీఐలో చేరేందుకు ఈ నెల పదిన వారు దరఖాస్తు చేసుకున్న కళాశాలల్లో కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారని వెల్లడించారు. దరఖాస్తు గడువు ఈ నెల ఏడుతో ముగియనుందన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట



ముత్తుకూరు: కార్యక్రమానికి హాజరైన అతిథులు

ముత్తుకూరు: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ పేర్కొన్నారు. మండలంలోని వల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ పెంచలప్రతాప్ బుధవారం ప్రారంభించారు. పౌష్టికాహార పదార్థాల స్టాల్‌ను ప్రజాప్రతినిధులు సందర్శించారు. దాదాపు 310 మందికి వైద్యసేవలను డాక్టర్లు శ్రీనివాసులు, హర్షిత, సునీల్‌కుమార్, మౌనిక, తదితరులు అందించారు. అనంతరం పలువురికి మందులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, నేతలు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, పోచారెడ్డి చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: మండలంలోని మరుపూరు జెడ్పీ హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. శిబిరాన్ని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా చేయిస్తామని తెలిపారు. మండల మెడికల్ ఆఫీసర్ నరసింహారావు, తహసీల్దార్ వీరవసంతరావు, డాక్టర్ కావ్య, స్పెషలిస్ట్ డాక్టర్లు మల్లికార్జున, గులాబీ, దినకర్ పాల్గొన్నారు.

వెంకటాచలం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని కంటేపల్లిలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కసుమూరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు పలువురు స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరై రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కసుమూరు పీహెచ్‌సీ వైద్యులు ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యసేవలను పీహెచ్‌సీ వైద్యాధికారి సుచిత్ర ఆధ్వర్యంలో అందించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: మరుపూరులో..



వెంకటాచలం: కంటేపల్లిలో..



ఇందుకూరుపేట: జగదేవిపేటలో..